కథాకేళి

దూరం

అది శ్రీహరికోట లోని పరిశోధనాలయం. ప్రొఫెసర్ భార్గవ వెస్ట్ జర్మనీలో శిక్షణ పొంది తిరిగి వచ్చి వారం రోజులే అయింది. వచ్చినప్పటి నుంచి స్పేస్‌కి సంబంధించిన ఓ పరిశోధనలో మునిగి పోయాడు.

ప్రొఫెసర్ అంటే పెద్దవాడేం కాదు. వయస్సు ముప్పై ఆరేళ్లు. అతనికి చాలా కాలంగా కొరుకుడు పడని ఓ సమస్యని ఎలాసాధించాలో జర్మనీలోవుండగా స్ఫురించింది. అందుకే రాగానే ఆ సమస్యని సాల్వ్ చేసే ప్రయత్నంలో వున్నాడు.

* * *

భార్గవ భార్యకి విరాగ్గా వుంది. రాత్రి ఎనిమిది దాటుతోంది. అతను రెండు వెలలు దూరదేశం వెళ్ళాడు. వచ్చాక భార్యతో కులాసాగా గడపాలన్న ఇదే లేదు. వచ్చినప్పటి నుంచి లేబ్... లేబ్... లేబ్... ఒకటే పరిశోధన. అర్ధ రాత్రి దాటాక వస్తాడు ఇంటికి. జీప్ కూడా వుండదు. ఏ పామో కరిస్తే?...

* * *

'సమస్యకి పరిష్కారం తేలికగా వచ్చేటట్లు లేదు' అనుకున్నాడు భార్గవ తన లెక్క తప్పడంతో. కంప్యూటర్‌కి మళ్ళీ కొత్త డేటా ఫీడ్ చేయసాగాడు. తనొక్కసారి అంతదూరం వెళ్ళిరాగలిగితే ఈ సమస్యకి పరిష్కారం లభించినట్లే. కాని వెళ్ళడం కుదరదు అనుకున్నాడు. మళ్ళీ కంప్యూటర్‌లోని కీబోర్డ్‌ని నొక్కసాగాడు.

* * *

మిసెస్ భార్గవ గోడ గడియారం వంక చూసింది. పదిన్నరడేమిట్— ఇంకా ఇంటికి రాకపోవడంఏమిటి? ఉదయం జీప్ ఎక్కుతున్నప్పుడు అతనితో తను గొంతుతగ్గించి డ్రయివర్‌కి విన పడకుండా చెప్పింది కూడా—

"రాత్రి మల్లెపూలు కొంటున్నాను. త్వరగా రండి"

"సరే" అన్నాడు. తను పక్కింటాయన కొడుకుని బతిమాలి, స్కూటరిచ్చి మూళ్ళూరు పేటదాకా పంపించి తెప్పించిందా తాజా మల్లెపూలు— ఏదీ? ఈయన వస్తేగా? ఆ కంప్యూటరే తన సవతి అయికూర్చుంది. అసలు...

* * *

భార్గవకి అపజయం ఎదురవుతున్నకొద్దీ పట్టుదల పెరుగుతోంది. మనిషికిచేరువలో లేకుండా ఎంతో ఎత్తులో, దూరంగా వున్న స్పేస్‌లోని అసమస్యఅర్థం అయింది కాని పరిష్కారమే దొరకడంలేదు. మరోసారి తను కంప్యూటర్‌లోకి ఫీడ్ చేసిన సమాచారాన్ని చెక్ చేశాడు. దాంట్లో కొన్ని మార్పులు చేసి మళ్ళీ ప్రెష్‌గానే కాల్క్యులేట్ చేయసాగారు.

టైమెంతయిందో కూడా చూసుకోలేదు భార్గవ. అప్పుడు టైం పదుకొండుంపావు.

* * *

పదకొండుంపావు అవగానే 'ఇంకొక్కపావుగంట చూస్తాను' అని తనకి తానే సమాధానం చెప్పుకుంది మిసెస్ భార్గవ. పావుగంటకి అయిదు నిమిషాల ముందు 'పదకొండు దాకా చూసి పడుకుంటాను' అనుకుంది. పదకొండుకి 'ఇంకో పావుగంట చూస్తాను' అనుకుంది. మళ్ళా ఇప్పుడు ఇంకో పావుగంట చూడాలనుకుంది.

'కట్టుకున్న భార్య కోరిక తెలుసుకోలేకపోతే ఎంత చదివి ఏం లాభం' అనుకుంది పదకొండున్నరకి. మల్లెపూల దండని కిటికీ తెలుపులు తెరచి బయటకు గిరాటేసి, లైటార్పి పడుకుంది.

* * *

రాత్రి పన్నెండు ఇరవై అయిదుకి కంప్యూటర్ డిస్‌ప్లేలోని ఈక్వేషన్‌ని చూసాడు భార్గవ. అతని మొహం ఆనందంతో వెలిగిపోయింది. ఎంతో కాలం చాలామంది సైంటిస్ట్‌లకి పెద్ద సమస్యగా మిగిలిపోయిన ఆ కఠినమయిన విషయాన్ని తను తొలిసారిగా సాల్వ్ చేయగలిగాడు. సమస్య అర్థం చేసుకునే తీరులో అంతా పప్పులో కాలేశారు. తను మరో కోణం నుంచి దాన్ని అర్థం చేసుకోబట్టిపరిష్కారంకనుక్కోగలిగాడు.

తృప్తిగా విత్డ్రార్చి, తన రైటింగ్ పాడ్‌లో వాటి వివరాలు మర్చిపోకుండా రాసుకుని ఇంటికి బయలుదేరాడు. చల్లగాలిలో నడుస్తూంటే అతనికి ఎంతో స్వాంతనగా వుంది. ముప్పావు గంటలో ఇంటికి చేరుకున్నాడు. డోర్ బెల్ నొక్కాడు. నిద్రలో వున్నమిసెస్ భార్గవ లేచి తలుపు తెరిచింది.

"టైమెంత?" అడిగింది ఆవలిస్తూ

"రెండున్నరనుకుంటాను" తనే చెప్పింది కలువుగా.

బట్టలు మార్చుకున్నాక అడిగాడు భార్గవ ఆమె తరహా కనిపెట్టి.

"ఏమిటి రెండు రోజుల నుంచి అదోలా వుంటున్నావు?"

"ఏం లేదు"

"భూమికి మూట ఏటై ఎత్తున వుండే ఓ ప్రధాన సమస్యని సాల్వ్ చేశాను తెలుసా?" చెప్పాడు గర్వంగా.

"అంతదూరంలో వున్న అంతరిక్షంలోని సమస్యలని సాల్వ్ చేసే మీకు పక్క మన్న మనిషి అంతరాంతరాల్లోని సమస్యే అర్థం కాదు" చెప్పింది మిసెస్ భార్గవ.

ఇందాకటి ఈక్వేషన్‌ని మనసులో వేసుకుంటూన్న భార్గవకి ఆ మాటలు చెవికెక్కలేదు.

మల్లాది వెంకటకృష్ణమూర్తి